క్లుప్తంగా

కేంద్ర బలగాల కవాతు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలందరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానంలో స్థిరపడాలి



నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడాలని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో వీడ్కోలు సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకొని సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శర్మ, షీ టీం ఏఎస్ఐ విజయలక్ష్మి, షీ టీం సభ్యుడు వెంకటయ్య పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాన్‌లోకల్ వ్యక్తులను తక్షణమే నియోజకవర్గం నుంచి పంపించాలని శుక్రవారం ఏఎస్పీ రామేశ్వర్‌రావుకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజు, రాంచందర్ వినతిపత్రం అందజేశారు. భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ తేదీకి 48 గంటల ముందు నాన్‌లోకల్ వ్యక్తులు ఉండొద్దని నిబంధన ఉందని వివరించారు.

ఆర్ కృష్ణయ్యపై దాడి దుర్మార్గం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యపై దాడి చేయడం దుర్మార్గమని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్, కాళ్ల నిరంజన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కల్వకుర్తిరూరల్: ఆర్ కృష్ణయ్యపై దాడిని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ ఖండించారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. మల్లేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

పెద్దకొత్తపల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలో విజేత జట్లుకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, వెంకటస్వామి, మధు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెదిన బాలకిష్టయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మధు, రాముడులు రూ.10 వేలు మృతుడి భార్య భార్య ఇందిరమ్మకు అందజేశారు. కార్యక్రమలో బిచ్చన్నగౌడ్, రాంబాబు, దామోదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు అద్దాలు ధ్వంసం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రలో నిలిపి ఉంచిన ప్రైవేటు పాఠశాల బస్సు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బిజినేపల్లి మండల కేంద్రంలోని ఆల్‌సెయింట్స్ హైస్కూల్‌కు చెందిన 4 బస్సులను జిల్లా కేంద్రంలో నిలిపి ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల బస్సు అద్దాలను ధ్వంసం చేశారని పేర్కొన్నారు.

నిర్వహణకు నిధులు కరువు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలిచిన సేవలు



కొల్లాపూర్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సేవలు ఐదు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో స్థలాల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. శుక్రవారం కొందరు రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కార్యాలయంలోని కంప్యూటర్లకు ఇన్వర్టర్ బ్యాటరీలతో కనెక్షన్లు ఏర్పాటుచేశారు. బ్యాటరీలు పాడైపోవడంతో సిస్టమ్‌లకు కరెంట్ సరఫరా కావడం లేదు. బ్యాటరీలు మారిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కానీ అధికారులు ఈ దిశగా దృష్టిసారించడంలేదు. దీంతో వినియోగదారులు రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే కార్యాలయ నిర్వహణకు నిధులు లేవు. కొత్త బ్యాటరీలు ఏర్పాటు చేసేవరకు రిజిస్ట్రేషన్లు చేయలేం అంటూ చేతులెత్తేస్తున్నారు. కార్యాలయంలో పదుల సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాకుండా నిలిచిపోయాయి. కార్యాలయ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ అఫ్జల్‌ను వివరణ కోరగా.. ఈదురుగాలులు, పిడుగుపాటు కారణంగా ఇన్వర్టర్ల బ్యాటరీలు, యూపీఎస్ డ్యామేజ్ అయ్యాయి. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని తెలియజేశారు.

కాంగ్రెస్‌తోనే మహిళల అభ్యున్నతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: కాంగ్రెస్‌తోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం అమలు చేస్తున్నామన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి అండేడ్కర్ విగ్రహం వరకు రోడ్‌షో నిర్వహించారు. మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మోపతయ్య, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, రాజేందర్, ఇందిరమ్మ, మంజుల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందిస్తాం

బల్మూర్: ఎవరు అడ్డుకున్నా ఉమామహేశ్వర రిజర్వార్ పనుల ఆగవని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వార్ పనులను పారదర్శకతంగా చేపట్టి రైతులకు న్యాయం చేస్తామన్నారు. రాజేందర్, వెంకట్‌రెడ్డి, రమేష్, ఖదీర్, బుచ్చిరెడ్డి, నిమ్మల విష్ణు, నర్సింగ్‌రావు, గణేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: అన్ని సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. చంద్రమౌళి, షఫీ, నయీమ్, షకీల్, నారాయణ గౌడ్, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రంతో పాటు పదరలో ఎమ్మెల్యే వంశీకృష్ణ రోడ్‌షో నిర్వహించారు. ఎంపీపీ శ్రీనివాసులు, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, వైస్ఎంపీపీ ప్రణీత, మండల అధ్యక్షులు రామలింగయ్య యాదవ్, హరినారాయణగౌడ్ ఉన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెద్దిరాజు మరో 20 మంది బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో చేరారు. శ్రీనివాసచారి, రేణయ్య, సైదులు, మల్లయ్య పాల్గొన్నారు.

రెన్యూవల్ పేరిట వ్యాపారస్తులకు టోకరా

అచ్చంపేట రూరల్: ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఆన్‌లైన్ మోసాల సంఖ్య రోజు రోజుకు విపరీతంగా పెరుగుతోంది. తాజాగా సైబర్ నేరగాళ్లు అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో సరికొత్త మోసానికి తెరలేపారు. పట్టణంలోని పలువురు వ్యాపారస్తులకు రెండు రోజుల కిందట ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు. మీ ట్రేడ్ లైసెన్సు రెన్యూవల్ చేయాలి నేను అచ్చంపేట మున్సిపల్ ఆఫీసు నుండి మాట్లాడుతున్నా అని నమ్మబలికాడు. డబ్బులు చెల్లించకపోతే మీ దుకాణం సీజ్ చేస్తాం అని భయపెట్టించారు. దీంతో పలువురు వ్యాపారస్తుల వద్ద డబ్బులు చెల్లించారు. గత వారం రోజుల నుంచి అచ్చంపేటలోని పలు దుకాణాదారులు, వ్యాపారస్తులకు ఫేక్ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఇది నమ్మిన కొందరు వ్యాపారస్తులు ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు మున్సిపల్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా తమకేమీ సంబంధం లేదని, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉన్నామని చెప్పడంతో అవాక్కయ్యారు. రూ. లక్షల్లో ఫోన్‌పే ద్వారా పలువురు వ్యాపారస్తులు చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా...కొందరు వ్యాపారస్తులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడినట్లు తెలిసిందని.. అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని, ట్రేడ్ లైసెన్సుల రెన్యూవల్ కోసం మీ సేవా కేంద్రాల్లో లేదంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో బకాయిలు చెల్లించి రశీదులు తీసుకోవాలన్నారు.

బీజేపీతోనే దేశ రక్షణ, సంక్షేమం



కొరటికల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

ఉప్పునుంతల: బీజేపీతోనే దేశ రక్షణ, సంక్షేమం సాధ్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని కొరటికల్‌లో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఆయన రోడ్‌షో నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాత్రి 9.30 గంటలకు ఉప్పునుంతల మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌తో కలిసి కేంద్రమంత్రి మురుగన్, ఎంపీ రాములు రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రావు, శ్రీనునాయక్, సైదులుయాదవ్, రమేష్, నాగయ్యగౌడ్, బాలయ్య, బ్రహ్మచారీ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: కాంగ్రెస్ ఓటమి భయంతో రిజర్వేషన్లపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి అన్నారు. నెల్లికొండ వద్ద ఉన్న పార్లమెంట్ బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

కోడేరు: మండలంలోని మైలారంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ప్రచారం చేశారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం, మాచినేనిపల్లి, గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు సాయి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని తాండ్రలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుండూరు ఎంపీటీసీ నర్సిరెడ్డి, జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డిలు ప్రచారం చేశారు.

బసవేశ్వరుడి బోధనలు ఆదర్శనీయం



కల్వకుర్తిలో బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి టౌన్: మహాత్మా బసవేశ్వర బోధనలు ఆదర్శనీయమని మాజీ మున్సిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం అన్నారు. శుక్రవారం పట్టణంలోని కైలాసం గుట్టవద్ద ఉన్న బసవేశ్వరుని విగ్రహం వద్ద 891వ జయంతి వేడుకల్లో వీరశైవ లింగాయత్ సభ్యులతో కలసి ఆయన పాల్గొన్నారు. కుల రహిత సమాజ స్థాపనకు బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారన్నారు. చంద్రశేఖరప్ప, శ్రీశైలం, శేఖరప్ప, విశ్వనాథం, రాజశేఖర్, ఈశ్వరయ్య, వినయ్, నందీశ్వర్, రుచిత్, నేహల్ తదితరులు ఉన్నారు.

భార్యను హతమార్చి భర్త ఆత్మహత్య

వివాహేతర సంబంధమే కారణం

బిజినేపల్లి: వివాహేతర సంబంధం కొన్నిసార్లు నిండు ప్రాణాలను బలి తీసుకోవడమే కాకుండా, ఆ ఉచ్చులో ఇరుకున్న మరికొన్ని కుటుంబాలను కూడా రోడ్డున పడేస్తుంది. అవమానం, మనోవేదనకు గురికాకూడదని వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్యను ఇంట్లోనే హతమార్చి, భర్త తానూ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండలంలోని మంగనూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య(42), రెండవ భార్య తారకమ్మ(35). ఆమె అదే గ్రామంలో కొందరు వ్యక్తులతో వివాహేతర సంబంధాలు పెట్టుకుంటే గ్రామ పెద్దలు పలు సందర్భాల్లో హెచ్చరించారు. అయినా తారకమ్మ తీరు మారలేదు. ఆమెను తీరును అవమానంగా భావించిన వెంకటయ్య ఆగ్రహంతో గురువారం రాత్రి భార్యను ఇంట్లోనే తలను బండనేలకి బాది హతమార్చాడు. తర్వాత తనపై కేసులు, జైలు జీవితం వంటి ఘటనలు తన మొదటి భార్యను, ఐదు మంది పిల్లలను మనోవేదనకు గురి చేస్తాయేమోనని తాను ఊరి బయట చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో భార్య కుమారులు తమ కన్న తల్లి రక్తపు మడుగులో పడటం చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటయ్య గురించి ఆరా తీస్తుండగానే ఆయన ఊరి బయట చెట్టుకు ఉరేసుకోవడంతో అంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతదేహాలను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ నాగశేఖర రెడ్డి తెలిపారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా



చారకొండ: నాగర్‌కర్నూల్ ఎంపీగా ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ ప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ఓటమి ఖాయమని దీంతో అసత్య ప్రచారాలకు తెరలేపారన్నారు. బీజేపీతోనే దేశ భద్రత, పేదల సంక్షేమం సాధ్యమన్నారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు కిరణ్, కృష్ణయ్య, శ్రీను, శ్రీకాంత్, సతీష్ రెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

13న వేతనంతో కూడిన సెలవు

నాగర్‌కర్నూల్: పోలింగ్ రోజు సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని చెప్పారు.

బాలిక మృతిపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో గురువారం జోగు పావని(14) నీటమునిగి మృతిచెందింది. ఈ విషయమై బాలిక తండ్రి బల్మూర్ మండలం కొండనాగుల గ్రామానికి చెందిన జోగు బౌరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుజ్ఞాణం తెలిపారు. మండల కేంద్రంలోని బాలిక పెద్దమ్మ ఇంటికి వచ్చింది. అన్న శ్రీనాథ్‌తో కలిసి సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌కు ఈతకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటి మునిగింది. అక్కడున్న వారు గమనించి వెంటనే బాలికను నీటి నుంచి బయటకు తీసి అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందిందని ఏఎస్ఐ పేర్కొన్నారు.

సామాజిక సేవే లక్ష్యం



కల్వకుర్తిరూరల్: సామాజిక సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యమని నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్చాల బంగారు మైసమ్మతల్లి దేవాలయానికి వాటర్ డిస్పెన్సరీని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ సహకారంతో ఆయన అందించారు. రమేష్, శ్రీధర్, శ్రీనివాస్, కృష్ణయ్య, గణేష్, రవిగౌడ్, రాజయ్య, కృష్ణయ్య, రమేష్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఓర్వలేక అసత్య ప్రచారాలు

కల్వకుర్తిరూరల్: రోజురోజుకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లభిస్తున్న ఆదరణ చూసి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు నిధులు జమ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్ రాజునాయక్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 1995–1999 వరకు చదివిన శుక్రవారం విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని కుటుంబ, ఉద్యోగ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మల్లు రవిని ఆదరించండి



పెద్దాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో మల్లురవిని ఆదరించాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి డా మల్లురవికి మద్దతుగా మండలంలోని పెద్దాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక ఇంద్రకల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా సీపీఎం ఆధ్వర్యంలో మజీద్‌ల వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఐ నాయకులు శివశంకర్, కపిలవాయి గోపిచారి, ఆర్ శ్రీనివాసులు, కందికొండగీత ఉన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో చేరారు.

తాడూరు: మండల కేంద్రంలో జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీసీ రేణుక, మహిళా కాంగ్రెస్ నాయకురాలు వసంతల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

తెలకపల్లి: మండలంలోని కార్వంగలో మల్లు రవికి మద్దతుగా సీపీఎం జిల్లా నాయకులు ఆర్ శ్రీనివాసులు, గోపస్ లక్ష్మన్, నందిపేట భాస్కర్, కాంగ్రెస్ నాయకులు జంగయ్యలు ప్రచారం చేశారు.

పెద్దకొత్తపల్లి: వెనచర్ల గ్రామంలో ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ కోరారు. సూర్యప్రతాప్‌గౌడ్

నాగర్‌కర్నూల్ క్రైం: తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జనసేన రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు వంగలక్ష్మణ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షి సమక్షంలో చేరాడు.

కొల్లాపూర్: పట్టణంలో టీపీసీసీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యాల చెన్నయ్య కరపత్రాలను విడుదల చేశారు. మాలల చైతన్యసమితి నాయకులతో కలిసి ఆయన అంబేడ్కర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయతీ ఆశాదీప్‌రెడ్డి ఆయన ప్రచారం చేశారు.

చారకొండ: మండల కేంద్రంతో పాటు జూపల్లి, తిమ్మాయిపల్లి, చంద్రాయన్‌పల్లిలో ముమ్మరంగా ప్రచారం చేపట్టారు.

ఆరు గ్యారంటీ హామీలతో మోసం



జూపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

చారకొండ: ఆరు గ్యారంటీ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని జూపల్లిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా ఆయర ర్యాలీ నిర్వహించి, కార్నర్ మిటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, జిల్లా నాయకులు హైజాక్, విజయ్, తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని చౌటపల్లిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం 15 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. నరేందర్‌రెడ్డి, రాంచందర్‌యాదవ్, కాటం జంబులయ్య, పసుపుల కృష్ణ, ఖాదర్ పాష, కృష్ణమూర్తి, పుట్టపాగ నాగరాజు, శ్రీరామ్

వెల్దండ: మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలను నాయకులు కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ విజితారెడ్డి, మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, జంగయ్య ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఆర్డీఓ మాధవి

బల్మూర్: ఓటు హక్కును తప్పనిసరి ఉపయోగించుకోవాలని అచ్చంపేట ఆర్డీఓ మాధవి సూచించారు. మండలంలోని ఉమామహేశ్వర రిజర్వాయర్ పనుల అనుమతులను రద్దు చేస్తేనే పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ఇటీవల బల్మూర్, మైలారం చెందిన భూనిర్వాసిత రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన ఆర్డీఓ శుక్రవారం బల్మూర్, మైలారంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. రాజ్యాంగంలో ఓటు హక్కు అనేది ప్రధానమైనదని దానిని వినియోగించుకోవాలని సూచించారు. బల్మూర్ వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం, మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలపై నివేదికను అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. దీంతో పాటు రైతుల భూములు అధిక శాతం ముంపునకు గురికాకుండా నిషేదిస్తామన్నారు. ఇష్టమైన వారికే ఓటు వేయాలని సూచించారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

నాగర్‌కర్నూల్ క్రైం: జల్సాలకు అలవాటుపడిన వ్యక్తి జిల్లాలో పలు చోరీలకు పాల్పడగా, అతన్ని అరెస్టు చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. జడ్చర్లలోని ఎర్రసత్యం కాలనీకి చెందిన బొంతల మూర్తి తల్లిదండ్రులు చనిపోవడంతో షాద్‌నగర్‌లో వాటర్‌ప్లాంట్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి షాద్‌నగర్‌లో చోరీలకు పాల్పడే ఇద్దరు వ్యక్తులు పరిచమయ్యారు. జల్సాలకు అలవాటు పడి తాళాలు వేసిన ఇళ్లను పగలు, రాత్రి రెక్కి నిర్వహించి చోరీలకు పాల్పడేవాడని తెలిపారు. ఇటీవల తిమ్మాజిపేట గొరిటతో పాటు తాడూరు మండలంలో చోరీలకు పాల్పడటంతో కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడిని గురువారం తిమ్మాజిపేటలో వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడు బొంతల మూర్తి నుంచి 8.5తులాల బంగారు ఆభరణాలు, 80తులాల వెండి ఆభరణాలు, రూ1.50లక్షల నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడికి ఇది వరకే షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, వనపర్తి, అమరచింత, కొత్తకోట, మహబూబ్‌నగర్, పెబ్బేర్, నారాయణపేటలో 29 చోరీ కేసుల్లో జైలుకు వెళ్లాడని, పీడీ యాక్ట్ కేసు కూడా నమోదైనట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ బుర్రి శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్

నాగర్‌కర్నూల్: దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమేనని, ప్రతి ఓటరు విజ్ఞతతో తమ హక్కును వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ల శాతం పెంచేందుకు ఎన్నికల స్వీప్, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు పాటల ద్వారా చైతన్యపరిచి, ఓటింగ్ శాతం పెంచుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వీప్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచే దిశగా కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా కళాశాలల్లో చదువుతున్న యువ ఓటర్లను చైతన్యపరిచి, 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ఓటర్లలో చైతన్యం తెస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో కీలకమైందని ప్రతిఒక్కరూ సోమవారం పోలింగ్‌లో తప్పనిసరిగా పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.